క్లుప్తంగా

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న యువకులు

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలంలోని కోహినూర్ గ్రామంలో శుక్రవారం నెహ్రూ కేంద్రం, ఆదిలాబాద్ వారి సహకారంతో ఆసరా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన, ఆదివాసీ, యువజన సంఘం యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు జిల్లాపల్లి శంకర్, అంజయ్య, దినకర్, కనక లింగు, అన్వేశ్, సుద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా రామచందర్ రావు



బాధ్యతలు స్వీకరించిన రామచందర్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

లింగాపూర్: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామచందర్‌రావుకు శుక్రవారం బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయనను కార్యాలయం సిబ్బంది, మండల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు జాదవ్ లోకేందర్, ఆత్రం అనీల్, ఆడే ఆత్మారాం, చవాన్ సునీల్, చవాన్ రాంకిషన్‌తో పాటు ఈశ్వర్, ఉద్దవ్, బలిరాం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

బెజ్జూర్: మండలంలోని సులుగుపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన కుమురంభీం స్మారక క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ క్రీడల్లో సులుగుపల్లి జట్టు ప్రథమ స్థానం, బెజ్జూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సంతోష్, రామయ్య, అశోక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

2 నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో ఈ నెల 2 నుంచి గ్రామ పంచాయతీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరేశ్, వెంకటేశ్, ఆకాశ్ శుక్రవారం తెలిపారు. వివరాలకు 63024 43427, 9398 201521లో సంప్రదించాలన్నారు.

దేవాలయంలో దొంగతనం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓల్డ్‌కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర మార్కండేయ దేవాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయ ద్వారం పగులగొట్టి హుండీలోని సుమారు రూ.15 వేలు ఎత్తుకెళ్లినట్లు ఆలయ పూజారి శ్రీనివాస శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సుధాకర్ పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు.

గుడుంబా పట్టివేత



స్వాధీనం చేసుకున్న బైక్, గుడుంబా

బెజ్జూర్: అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు శుక్రవారం రంగాపూర్ క్రాస్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లంబాడిగూడ గ్రామానికి చెందిన కుసోట్ మంజి అనే వ్యక్తి లంబాడిగూడ నుంచి బెజ్జూర్‌కు ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తుండగా పట్టుకొని బైక్‌తో పాటు గుడుంబా స్వాధీనం చేసుకున్నామని, అనంతరం కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

'పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోవాలి'

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతీ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు వినియోగించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేలా ప్రతీ కార్యకర్త సమన్వయంతో కృషి చేయాలన్నారు. అరుణ్‌లోయా, శ్రీనివాస్, చేరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మహేందర్‌రెడ్డిని గెలిపించాలి'

కౌటాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాకేశ్, రమేశ్, హరీశ్, నారాయణ, హన్మంతు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జోరుగా యాసంగి సాగు

- మండలంలో 2890 ఎకరాల వరకు పంటల సాగు
- అత్యధికంగా 2250 ఎకరాల్లో వరి సాగు
- పెరిగిన వేరుశనగ సాగు విస్తీర్ణం



దేవులగూడ సమీపంలో అంతరపంటగా సాగవుతున్న వేరుశనగ



నంబాల శివారులో వరినాట్లు వేస్తున్న కూలీలు

రెబ్బెన: మండలంలో యాసంగి పంటల సాగు జోరందుకుంది. వానాకాలం పంటలు సాగు ముగియడంతో సాగు నీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులు యాసంగి పంటల సాగుపై దృష్టి సారించారు. గత సంవత్సరం మాదిరిగానే ఈసారి సైతం మండల రైతులు అధికంగా వరిసాగు వైపే ఆసక్తి చూపుతున్నారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఇతర పంటల సాగు విస్తీర్ణం సైతం పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సాగు పనుల్లో రైతులు నిమగ్నం కాగా వ్యవసాయ శాఖ అధికారులు యాసంగి పంటల సాగు లెక్కలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం రైతుభరోసా పథకం అమలులో వ్యవసాయ శాఖ బిజీబిజీగా ఉండగా త్వరలోనే యాసంగి పంటల సాగు వివరాలను సేకరించనున్నట్లు సమాచారం.

వరి సాగే అధికం..

మండలంలోని రైతులు గత సంవత్సరంలో మాదిరి ఈ యాసంగిలోనూ వరి పంట సాగుకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. మండలంలోని నంబాల, నారాయణపూర్, కిష్టాపూర్, కొమురవెల్లి, రెబ్బెన, పుంజుమేరగూడ, నక్కలగూడ, ఎడవెల్లి, కైరిగాం, తక్కళ్లపల్లి ప్రాంతాల్లో రైతులు వరిసాగు చేపడుతున్నారు. రెబ్బెన, పుంజుమేరగూడ, నక్కలగూడ, ఎడవెల్లి, కైరిగాం ప్రాంత రైతులు వట్టివాగు కాలువ కింద వరిసాగు చేపడుతుండగా మిగిలిన ప్రాంతాల్లో రైతులు బోరుబావులు, గంగాపూర్ వాగు నీటిపై ఆధారపడి వరి సాగు చేపడుతున్నారు. నవంబర్‌లోనే వరి కోతలు పూర్తి చేసుకున్న రైతులు అదే నెలలో నారు పోసి నెల రోజుల క్రితమే వరినాట్లు సైతం వేసుకున్నారు. కాస్త ఆలస్యంగా వరికోతలు చేపట్టిన రైతులు మాత్రం ప్రస్తుతం నాట్లు వేసుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా మండలంలో చలితీవ్రత అధికంగా నమోదవుతుండటంతో వరినారులో ఆశించిన పెరుగుదల లేకపోవడంతోనూ నాట్లు వేసే ప్రక్రియ కాస్త ఆలస్యంగా మారింది. గత సంవత్సరం మండలంలో 2210 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టగా ఈసారి 2250 ఎకరాల వరకు వరిసాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన వేరుశనగ సాగు..

మండలంలో వేరు శనగ సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. గతంలో కేవలం దేవులగూడ, పులికుంట ప్రాంతాల్లో కొద్ది ఎకరాల్లో మాత్రమే ఈపంట సాగు చేసే వారు. కానీ ఈ సంవత్సరం ఇతర ప్రాంతాల్లోనూ వేరుశనగ సాగు చేస్తున్నారు. నీటి వనరులు అందుబాటులో ఉండి ఇసుక భూములు ఉన్న రైతులు వేరుశనగ పంట సాగుపై దృష్టిపెడుతున్నారు. గోలేటి, కైరిగూడ ప్రాంతాల్లో వానాకాలం పత్తి పంటలను సాగు చేసి పత్తిపంట పూర్తి కాగానే చెట్లను తొలగించి వేరుశనగ సాగుకు సిద్ధమవుతున్నారు. దాంతో ఈసారి ఈ పంట సాగు విస్తీర్ణం కాస్త పెరగనుంది. గత సంవత్సరం మండలంలో 220 ఎకరాల వరకు వేరుశనగ పంటను సాగు చేయగా ఈసారి సాగు విస్తీర్ణం 280 ఎకరాల వరకు చేరనుంది.

2890 ఎకరాల్లో..

ఈసారి మండలంలో సుమారు 2890 ఎకరాల్లో రైతులు యాసంగి పంటలను సాగు చేస్తున్నారు. వాటిలో అత్యధికంగా వరిపంట 2250 ఎకరాల్లో ఉండగా 15 ఎకరాల్లో జొన్న, 80 ఎకరాల్లో మొక్కజొన్న, 265 ఎకరాల్లో శనగ, 280 ఎకరాల్లో వేరుశనగ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గంగాపూర్, కొండపెల్లి, నేర్పల్లి, పాశిగాం, తుంగెడ తదితర ప్రాంతాల్లో రైతులు కూరగాయల సాగు చేపడుతున్నారు.

ఊపందుకున్నాయి..



మండలంలో యాసంగి పంటల సాగు పనులు ఇప్పుడే ఊపందుకున్నాయి. గత సంవత్సరం మాదిరిగానే ఈసారి సైతం వరి, వేరుశనగ పంటలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. చాలా గ్రామాల్లో వరినాటు పనులు సాగుతున్నాయి. గోలేటి, కైరిగూడ ప్రాంతాల్లో వేరుశనగ పంటల సాగు పనులు సాగుతున్నాయి.

– దిలీప్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

'కార్మికుల వేతనాలు చెల్లించకుంటే సమ్మె తప్పదు'



సమ్మె నోటీసు అందజేస్తున్న ఉపేందర్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని పలు విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించకుంటే సమ్మె తప్పదని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఉపేందర్ హెచ్చరించారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలోని క్వాలిటీ విభాగంలో ఐటీ వింగ్ ద్వారా వాహనాలకు టోల్ గేట్స్ వద్ద జీపీఎస్, జీపీఆర్ఎస్ సిస్టం కోసం యాజమాన్యం కొంతమంది కాంట్రాక్టు సిబ్బందిని నియమించిందన్నారు. గత కొన్ని నెలలుగా వారికి వేతనాలు అందకపోవటంతో సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చాలీచాలనీ వేతనాలకే విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధి కోసం కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌కు చెందిన నీడ్స్ ఆఫ్ టెక్నాలజీ అనే సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడంతో సదరు కాంట్రాక్టు సంస్థ గత 5 నెలలుగా సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ వేతనాల విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించని పక్షంలో ఫిబ్రవరి 1 నుంచి సమ్మె చేయక తప్పదని హెచ్చరించారు. కార్మికులు జాడి సాయి, కోట ప్రవీణ్, మారం కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ కొనసాగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఈనెల 28వ తేదీ వరకు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్, 1861 అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి లేదా పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. నిషేధిత ఆయుధాలు కత్తులు, తుపాకులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, పేలుడు పదార్థాలు, నేరానికి ఉసిగొల్పే ఎలాంటి ఆయుధాలు వాడరాదని సూచించారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ సమావేశాలు, జన సమూహం పోగు నిషేధమని తెలిపారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేధమని తెలిపారు. ప్రజలు పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

డోర్లి ఓసీపీ సందర్శన



ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో మూసివేసిన డోర్లి 2 ఓసీపీని శుక్రవారం పశ్చిమబెంగాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్,సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ సందర్శించారు. ఏరియా అధికారులతో కలిసి ఓసీపీని సందర్శించిన ఆయన ఫైనల్ మైనర్ క్లోసర్ తనిఖీల్లో భాగంగా మూతపడిన గని, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ, ప్రజాహిత పనులు, కట్టడాలను పరిశీలించారు. ఓసీపీ వద్ద నాటిన మొక్కలను, వృక్షాలను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృతిక సంరక్షణ చర్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గని మూసినప్పటికీ అక్కడ చేపట్టిన ఏర్పాట్లు, పనితీరుపై ఏరియా అధికారులను అభినందించారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ప్రొఫెసర్‌ను సన్మానించారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, కార్పొరేట్ అదనపు మేనేజర్లు తిరుపతి, గోనే బాబ్జీ, డోర్లి ఓసీపీ 2 మేనేజర్ మహేశ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, ఫారెస్టు అధికారి రమణారెడ్డి, సర్వేయర్లు రామరాజు, స్వామి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ సప్తశతి మహాయాగం



చండీ సప్తశతి యాగం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు నదీతీరాన గల శ్రీ బాలేశ్వరస్వామి లోయలో ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహించే రథోత్సవాన్ని పురస్కరించుకొని నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీ చండీ సప్తశతి మహాయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, రాజోపచారములు, మంగళహారతి, మహామంత్రపుష్పం, తీర్థ ప్రసాదవితరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు విజయ్‌కుమార్ శర్మ, అజయ్‌శర్మ, బాలేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న కార్మికులు



మురళీగౌడ్ దంపతులను సన్మానిస్తున్న కోవ లక్ష్మి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో విధులు నిర్వహించి శుక్రవారం పదవీ విరమణ పొందిన కార్మికులను ఓసీపీ అధికారులతో పాటు తోటి కార్మికులు, యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఓసీపీలో ఈపీ గ్రీజర్‌గా పని చేసిన అన్నం లక్ష్మయ్య, పంప్ ఆపరేటర్‌గా పని చేసిన దొంతుల సుదర్శన్‌లు పదవీ విరమణ పొందగా వారికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. గని అధికారులు మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు వారి శేష జీవితాన్ని సుఖశాంతులతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు శేషశయనరావు, కిరణ్, చంద్రశేఖర్, దివాకర్, వెంకటేశ్, కోటి, సింహాద్రి, తిరుపతి, రమేశ్, గోపాల్, సుధీర్, మహేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఆర్టీసీ డ్రైవర్‌కు సన్మానం

గత 30 సంవత్సరాలుగా ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేసిన మండల కేంద్రానికి చెందిన అన్నపూర్ణ మురళీగౌడ్ దంపతులను శుక్రవారం పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్లు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మాజీ వైస్ఎంపీపీ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి



వాంకిడి: నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో గద్దర్ 77వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ జాతిని జాగృతం చేసిన విప్లవ కవి, గాయకుడిగా ప్రజాయుద్ధనౌకగా ఖ్యాతి పొందిన గొప్ప యోధుడని కొనియాడారు. నాయకులు ఉప్రె విజయ్, విలాస్ ఖోబ్రగడె, రాజేంద్రప్రసాద్, దుర్గం సందీప్, గుర్నులె నారాయణ, శాంరావు, రోషన్, ప్రతాప్, ఇంద్రజిత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ 77వ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, పలువురు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ఇన్‌చార్జి సంధ్య, ఇర్ఫాన్, కార్తీక్, సంతోష్, రాకేశ్, సమ్మక్క, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు చేయడం సరికాదు'

తిర్యాణి: రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేసిందేమి లేదన్నారు. మండలంలో ప్రతీ గ్రామానికి రోడ్డు నిర్మించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు పర్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరీశ్ కుమార్, నాయకులు వెంకటేశ్, మొగిలి, విజయ్, శంకర్ ఉన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని వాసవీమాత మందిరంలో శుక్రవారం కన్యకాపరమేశ్వరీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మదిగొండ రాజశేఖర్‌శర్మ, వారణాసి సంతోష్‌శర్మ, నరేశ్‌శర్మ, ప్రసాద్‌శర్మ, చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని శివకేశవ మందిర్ వీధి, బ్రాహ్మణవాడ, రావులవాడ, గాంధీచౌక్‌మీదుగా వాసవీమాత ఉత్సవ విగ్రహం, 108 కలశాలతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయంలో అభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించగా, సాయంత్రం మంచిర్యాలకు చెందిన ఆర్కెస్ట్రా బృందం గాయకుడు మురళీ ఆధ్వర్యంలో ఆలపించిన భక్తిగీతాలు అలరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గంధం శ్రీనివాస్, చిలువేరు వెంకన్న, ఆటిపల్లి అశోక్, గుండా ప్రమోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, కార్యదర్శి మురళీధర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు పిన్నా వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రామాలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అభిషేకం నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

వసతిగృహంలో అగ్నిప్రమాదం



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలోగల మహాత్మా జ్యోతిబాపూలే బాలుర వసతిగృహంలోని కిచెన్ షెడ్డులో శుక్రవారం మధ్యాహ్నం గ్యాస్‌లీకై మంటలు చెలరేగాయి. వంట మనుషులు విద్యార్థుల కోసం రాత్రి వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో సిబ్బంది విద్యార్థులను అప్రమత్తం చేయడంతో వారు బయటికి వెళ్లిపోయారు. సమాచారం అందించగా తక్షణమే అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మంగ మాట్లాడుతూ.. గ్యాస్ పైపు లీక్ కావడంతో మంటలు చెలరేగాయని చెప్పారు. కాగా, నాసిరకమైన గ్యాస్‌పైపు కారణంగానే గ్యాస్ లీకై మంటలు చెలరేగాయని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ, ఓయూ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అన్నం నాగార్జున వేర్వేరుగా డిమాండ్ చేశారు.

హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర హాస్టల్‌లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు హాస్టల్‌ను సందర్శించారు. కిచెన్ షెడ్డు, హాస్టల్ డార్మెంటరీలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. విద్యార్థులు అద్దె భవనంలో దుర్భరమైన స్థితిలో చదువుకుంటున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బాలికల సంరక్షణ అత్యవసరం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: బాలికల సంరక్షణ అత్యవసరమని, బాలికల సంరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ శారద అన్నారు. శుక్రవారం కెరమెరి మండలంలోని మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బేటి బచావ్ –బేటి పడావ్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.